


తిరుపతి మధురానగర్ వీధుల్లో నిలిచిన వర్షపు నీరు



తిరుపతిలోని రైల్వే అండర్ పాస్ వద్ద నిలిచిన వర్షపు నీరు



తిరుపతి లక్ష్మీపురం సర్కిల్ నుంచి పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లే దారిలో వాహనదారుల ఇక్కట్లు

కుండపోత

27 మండలాల్లో సగటున 31.8 మి.మీ. వర్షపాతం

రేణిగుంటలో నిండిన పలు చెరువులు

వెంకటగిరి, బాలాయపల్లెలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతిలో నీట మునిగిన రైల్వే అండర్ పాస్‌లు.. వీధులు జలమయం



తిరుపతి వెస్ట్ చర్చి సమీపంలోని రైల్వే అండర్ పాస్ వద్ద ప్రవహిస్తున్న నీరు

తిరుపతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. 34 మండలాలకుగానూ 27 మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా వడమాలపేట మండలంలో 87.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 31.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. దాదాపుగా అన్ని మండలాల్లోనూ శనివారం వేకువజామున మొదలైన వర్షం ఉదయం 10 గంటల వరకూ కురిసింది. వెంకటగిరిలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోగా బాలాయపల్లి మండలం పాకూడి గ్రామంలో తాటి చెట్టు విరిగి విద్యుత్ లైన్లపై పడింది. తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శ్రీకాళహస్తిలో వర్ష తీవ్రతకు అధికారులు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. తిరుపతిలో వేకువజాము నుంచి ఉదయం 9 గంటల వరకూ మోస్తరు వాన కురిసింది. ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న, వెస్ట్ చర్చి సమీపంలోని రైల్వే అండర్ పాస్‌లు



తిరుపతి కపిలతీర్థం నుంచి జాలువారుతున్న జలపాతం

నీట మునిగి వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. లక్ష్మీపురం కూడలి నుంచి ఎయిర్ బైపాస్ రోడ్డు వరకూ జలమయమైంది. అశోక్‌నగర్, అబ్బన్న కాలనీ వీధులు చెరువులను తలపించాయి. ఆ ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. రేణిగుంటలో శనివారం తెల్లవారుజాము 2.30 నుంచి ఉదయం 11 వరకూ వర్షం కురిసింది. దానికి తోడు తిరుపతి నుంచి వచ్చి పడిన వర్షపు నీరు తోడు కావడంతో వెంకటాపురం, అన్నాస్వామిపల్లి, కరకంబాడి, మాదివానికుంట చెరువులు నిండి కలుజులు పారాయి. నారాయణవనంలో కురిసిన వానకు అరుణానది కల్వర్టులపై నీరు పొంగి ప్రవహించింది. పలు గ్రామాల్లో పంటపొలాలు నీట మునిగాయి. పుత్తూరు మండలం మూలనకోనలో వర్షపు తీవ్రతకు ప్రవాహ ఉధృతి పెరిగింది. దీంతో అటవీ శాఖ అధికారులు చెక్‌పోస్టు మూసివేసి రాకపోకలు నిలిపివేశారు.

వడమాలపేటలో 87.4 మి.మీ

జిల్లాలో 27 మండలాల్లో శనివారం వర్షపాతం నమోదైంది. వడమాలపేటలో 87.4 మిల్లీమీటర్లు, తిరుపతి రూరల్ 85.8, చంద్రగిరి 82.4, తిరుపతి అర్బన్ 75.8, తొట్టంబేడు 75.2, శ్రీకాళహస్తి 58.2, వరదయ్యపాలెం 55.2, సూళ్లూరుపేట 54.2, రేణిగుంట 54, నారాయణవనం 52.8, రామచంద్రాపురం 45.2, బీఎన్ కండ్రిగ 42.6, కేవీబీపురం 41.8, పిచ్చాటూరు 41.6, పుత్తూరు 41.4, చిన్నగొట్టిగల్లు 40.6, ఎర్రావారిపాలెం 35.8, ఏర్పేడు 27.2, పాకాల 24.4, నాగలాపురం 15.2, సత్యవేడు 11.4, తడ 10.6, చిట్టమూరు 8.2, వాకాడు 7.8, పెళ్లకూరు 3.8, దొరవారిసత్రం 1.2, నాయుడుపేటలో 0.8 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది. వెంకటగిరి, చిల్లకూరు, డక్కిలి, బాలాయపల్లి, గూడూరు, కోట, ఓజిలి మండలాల్లో మాత్రం వర్షం పడలేదు.

తిరుమలలోనూ జోరు వర్షం



ఆలయం ముందు దంచికొడుతున్న వర్షం

తిరుమల (ఆంధ్రజ్యోతి): తిరుమలలోనూ శనివారం వర్షం జోరుగా కురిసింది. వేకువజాము 5 నుంచి ఉదయం 8 గంటల వరకు భారీగా పడింది. శ్రీవారి దర్శనానికి వెళ్లేవారితోపాటు ముగించుకుని వెలుపలకు వచ్చిన భక్తులు వర్షంలో తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. పెరటాసి మాసం మూడో శనివారం కావడంతో తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. దర్శనం కోసం బాటగంగమ్మ సర్కిల్ సమీపంలోని క్యూలోకి ప్రవేశించే క్రమంలో భక్తులు తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. శ్రీవారిమెట్టు కాలినడక మార్గంలో వర్షపు నీరు జోరుగా ప్రవహించింది. మార్గం మధ్యలోని పక్కనే ఉన్న కాలువ ద్వారా వర్షపు నీరు వేగంగా ప్రవహిస్తూ మెట్లపైకి రావడంతో కాలినడక భక్తులు ఇబ్బందిపడ్డారు. ఉదయం 9 గంటల తర్వాత వర్షం పూర్తిగా నిలిచిపోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, తిరుమలలో చలి వాతావరణం పెరిగింది.

తిరుపతిలో చైన్‌స్నాచర్ల హల్‌చల్

● ఐదుగురు మహిళల నగలను లాక్కెళ్లిన వైనం



సీసీ కెమెరాలో దొంగలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం సాయంత్రం చైన్ స్నాచింగ్ ముఠా చెలరేగింది. ఇద్దరు అగంతకులు ముసుగులు ధరించి మహిళల మెడల్లో బంగారు గొలుసులు దోపిడీ చేశారు. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో తిమ్మినాయుడుపాళెం సమీపంలో కాపురమున్న నాగభూషణమ్మ మంగళం రోడ్డులో వెళుతుండగా గరుడాద్రినగర్ వద్ద బైక్‌లో వచ్చిన ముసుగు దొంగలు ఆమె మెడలో వున్న 48 గ్రాముల బంగారు చైను లాక్కొని పరారయ్యారు. ● అలిపిరి పరిధిలోని గొల్లవానిగుంట వద్ద సరస్వతమ్మ ఇంటి ముందు కూర్చుని వుండగా ఆమె మెడలోని 50 గ్రాముల బంగారు చైన్లు రెండు లాక్కొని పారిపోయారు. ● ఉపాధ్యాయనగర్‌కు చెందిన రాధ ఇంటి ముందు వాకింగ్ చేస్తుండగా ఆమె మెడలోని 38 గ్రాముల చైను లాక్కొని పరారయ్యారు. ● మంగళం రోడ్డులోని గంగారాం ఫంక్షన్ హాలు వద్ద రోడ్డుపై నిలుచుని ఉన్న మంజుల మెడలోని 26 గ్రాముల చైను లాక్కొని ఉడాయించారు. ● పోస్టల్ కాలనీకి చెందిన కె.జయశ్రీ ఇంటికి నడుచుకుని వెళుతుండగా ద్విచక్ర వాహనంపై వెళ్లి ఆమె మెడలోని 52 గ్రాముల మూడు బంగారు చైన్లు లాక్కొని వెళ్లిపోయారు. నిందితులు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సున్న యువకులుగా ఉన్నారని, సీసీ ఫుటేజీ ఆధారంగా వారిని గుర్తించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామని డీఎస్పీ భక్తవత్సలం తెలియజేశారు. రేపటిలోగా నిందితులను పట్టుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. ఇకపై మళ్లీ ఇలాంటివి జరగకూడదని హెచ్చరించారు.

ఇస్కాన్‌కు బాంబు బెదిరింపు

తిరుపతిలోని మూడు ప్రాంతాల్లో ఆర్‌డీఎక్స్ పెట్టామంటూ మెయిల్స్



తనిఖీలు చేస్తున్న బాంబు స్క్వాడ్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని ఇస్కాన్ ఆలయంతోపాటు మరో రెండు ప్రాంతాల్లో బాంబులు పెట్టామని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి మెయిల్స్ వచ్చాయి. తమిళనాడు రాష్ట్రం కరూర్ ఘటనను సీబీఐకి అప్పగించాలని అందులో పేర్కొంటూ డిప్యూటీ ఈవో డోనర్ సెల్.తిరుమల.ఓఆర్‌జీ పేరుతో, ఇస్కాన్ తిరుపతి పేరుతో మెయిల్స్ వచ్చాయి. శబరీష్ వేదమూర్తి పేరుతో శుక్రవారం అర్ధరాత్రి మెయిల్స్ రావడంతో అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ నాగార్జునరెడ్డి, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ అధికారి బీరయ్య ఇస్కాన్ ఆలయంలో తనిఖీ చేశారు. తిరుపతి, తిరుమలలో భక్తులు తిరిగే ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బాంబుల జాడ కనిపించకపోవడంతో ఫేక్ మెయిల్స్‌గా నిర్ధారించారు.

మ్యానిఫెస్టోలో లేకున్నా

ఆటో డ్రైవర్లకు సాయం

జిల్లాలో 14,375మందికి రూ.21.56 కోట్ల జమ



ఆటో డ్రైవర్లనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లంతా సంతోషంగా ఉన్నారని జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం తరహాలో వీరికి ఎలాంటి వేధింపులూ లేవన్నారు. రోడ్ టాక్స్, గ్రీన్ టాక్స్‌లూ లేవన్నారు. కార్మికుల, కర్షకుల పక్షాన తమ ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తోందన్నారు. శనివారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవలో..' కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో ప్రస్తావించకున్నా ఆటో డ్రైవర్లకు రూ.15వేలు చొప్పున అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లోనే 16 పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆటో డ్రైవర్ సేవలో పథకం కింద జిల్లా వ్యాప్తంగా 14375మంది ఆటో యజమానులకు రూ.21.56 కోట్ల మెగా చెక్కును మంత్రి లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం .పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకారం అందిస్తోందన్నారు. ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు ఎదురైతే తీర్చడానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధతో వారి కుటుంబాలు భద్రంగా ఉంటాయన్నారు. ఆటోడ్రైవర్ల నడవడిక, ఆరోగ్యానికి సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

వరుసగా ఫలితాలు..

ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కృషి ఫలితాలు ఒక్కొక్కటిగా అందుతున్నాయన్నారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఈ పథకం ఆటోడ్రైవర్ల జీవితాలలో వెలుగులు నింపుతుందన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నాయీ బ్రాహ్మణ చైర్మన్ రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ ఒడిదుడుకులు ఎదురైనా కూటమి ప్రభుత్వం సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తోందన్నారు. రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బి.కృష్ణవేణి మాట్లాడుతూ అర్హులుంటే ఈపథకం వర్తింపచేస్తామన్నారు. అనంతరం ఆటోడ్రైవర్లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్, ఆర్డీవో మురళీమోహన్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి, ఎంవీఐలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైన్లు, తాగునీటి కోసం రూ.80కోట్లు

తిరుపతి మున్సిపల్, తుడా అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ



తిరుపతి, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి) : తిరుపతిని మెగా సిటీగా మార్చేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాబోయే రెండేళ్లలో తిరుపతిలో డ్రైన్లు, ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, దీనికోసం రూ.80కోట్లు కేటాయించనున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. శనివారం రాత్రి తుడా కార్యాలయంలో నగరపాలక సంస్థ, తుడా అధికారులతో సమావేశమయ్యారు. కమిషనర్ మౌర్య కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. డ్రైన్లు లేని ప్రాంతాలను అడిగి తెలుసుకుని వాటి నిర్మాణం కోసం అయ్యే ఖర్చుతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. రోడ్ల శుభ్రత కోసం మిషన్లపై ఆధారపడాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్ల జారీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. తుడా వీసీ శుభం బన్సల్ తుడా ప్రగతిని వివరించారు. శెట్టిపల్లిలో తుడాకు రావాల్సిన 65 ఎకరాలతో పాటు రెవెన్యూ వాటా 90 ఎకరాలు కూడా తుడాకు వచ్చేలా ప్రయత్నిస్తున్నట్టు మంత్రి చెప్పారు. తుడా టవర్స్‌లో ప్లాట్లు మందకొడిగా అమ్ముడుపో తున్నాయని, ధర సవరణపై కమిటీని నియమించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ నగరంలో ప్రాధాన్యత పనులు పూర్తయిన వెంటనే సీవోసీ బిల్డింగ్ పూర్తి చేస్తామన్నారు. తిరుమల వర్షపునీరు మళ్లింపుపైనా చర్యలు తీసుకుంటామని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ కాపు, బీసీ భవన్‌లను పూర్తిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్‌బాబు పాల్గొన్నారు.

మానవాళి శ్రేయస్సుకే అంతరిక్ష ప్రయోగాలు

స్పేస్ వాక్ ప్రారంభోత్సవంలో షార్ డైరెక్టర్ పద్మకుమార్



స్పేస్‌వాక్‌ను ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడతాయని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అన్నారు. శనివారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం షార్ ఆధ్వర్యంలో నిర్వహించే అంతరిక్ష నడక (స్పేస్ వాక్) కార్యక్రమాన్ని సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. జూనియర్ కళాశాల మైదానం నుంచి షార్ ఉద్యోగుల కాలనీ స్వర్ణముఖినగర్ డీవీఎస్ కాలనీ వరకు స్పేస్ వాక్ నిర్వహించారు. ఇస్రో ప్రయోగించే రాకెట్లు, ఉపగ్రహాల నమూనాలను ఊరేగించారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ప్రాముఖ్యత గురించి షార్ డైరెక్టర్ విద్యార్థులకు వివరించారు. షార్ కంట్రోలర్ ముత్తు చెరియన్, కంట్రోలర్ రమేష్ బాబు, ఎంఎస్ఏ డీడీ గోపీకృష్ణ పాల్గొన్నారు.

నవంబరు నుంచి విద్యుత్ చార్జీల తగ్గింపు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది.తిరుపతి విద్యుత్ సర్కిల్ పరిధిలో 9,26,150 మందికి నవంబరు నుంచి గతంలో అధికంగా వసూలు చేసిన రూ.63.19 కోట్ల ట్రూఅప్ చార్జీలను తిరిగి చెల్లించడానికి రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈ వి.చంద్రశేఖరరావు, ఎస్ఏవో ఎ.శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఎస్ఈ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు వినియోగదారుల నుంచి ఎఫ్‌పీపీసీఏ చార్జీలు (ట్రూఅప్ చార్జీలు)గా వసూలు చేసిన మొత్తంలో విద్యుత్ కొనుగోలు ధరల సర్దుబాటు(ఎఫ్‌పిపిసీఎ)కు పోను మిగిలిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. ఈ సర్దుబాటు నవంబరు నుంచి వచ్చే ఏడాది అక్టోబరు వరకూ ప్రతినెలా వినియోగ బిల్లుల్లో తగ్గిస్తారని చెప్పారు.

రహదారిపై ఇసుకతో ప్రమాదాలు



రామచంద్రాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి-పచ్చికాపల్లం ప్రధాన రహదారిపై పలు ప్రదేశాల్లో గుంతలతో పాటు ఇసుక పేరుకుపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బాదూరు, పీవీపురం, ఆర్‌సీపురం ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు లేకపోవడంతో వర్షపునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో గుంతలతో పాటు ఇసుక పేరుకుపోయింది. గతంలో ఉన్న కాలువలు పూడిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వాహనచోదకులు గమనించకుండా ఇసుకపై ప్రయాణిస్తే అదుపు తప్పి ఆస్పత్రి పాలవుతున్నారు. మరీ రాత్రివేళ అయితే ఎక్కడ ఇసుకమేటలు ఉన్నాయో తెలియని పరిస్థితి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా కాలువలు తీసి ఇసుకమేటలు తొలగించాల్సి ఉంది.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



పాకాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పుదిపుట్లబైలు పంచాయతీ నడింపల్లె, కొండకింద పల్లె గ్రామాల నడుమ వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. మూడవ వార్షిక బ్రహ్మోత్సవాల పురస్కరించుకొని తొలుత అభిషేకం చేశారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారిని ఊరేగించారు.

ఆగిన విస్తరణ పనులు..తప్పని ఇబ్బందులు



ఇరుకు రహదారిలో ఇక్కట్లు

తిరుపతిరూరల్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): చిగురువాడ పంచాయతీ పరిధిలో ప్రతిపాదిత రహదారి విస్తరణ పనులు చేపట్టాలని స్థానిక కోరుతున్నారు. వేదాంతపురం అగ్రహారం సర్కిల్ నుంచి శివాలయం వరకు గతంలో వంద అడుగుల రహదారి విస్తరణకి ప్రతిపాదించారించినా నిధుల కొరతతో సీపీఆర్ విల్లాస్ వరకు మాత్రమే పనులు చేపట్టి వదిలేశారు. ఈమార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు సన్నగా ఉండటంతో రెండు పెద్ద వాహనాలు ఎదురుపడితే ఇబ్బందికరంగా ఉంటోంది. సంస్కృతనగర్ ఎదురుగా ఉన్న దారిలో కొంతదూరం మట్టి తోడేయడంతో గుంత ఏర్పడింది. ఇక్కడ ద్విచక్రవాహనదారులు ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదాల బారిన పడుతున్నారు.

దుర్గసముద్రంలో 24గంటలపాటు రామభజన

తిరుపతిరూరల్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రంలోని కోదండరామాలయంలో తిరుమల శనివారాలు పురస్కరించుకుని 24గంటలపాటు రామభజన నిర్వహించారు. గ్రామస్తులతో భజనభక్తబృంద సభ్యులు కలసి శుక్రవారం సాయంత్రం 6గంటలనుంచి శనివారం సాయంత్రం 6గంటలవరకు దీనిని కొనసాగించారు. ఈసందర్భంగా.స్వామివారి ఆలయాన్ని మామిడితోరణాలు, అరటి పిలకలతో సుందరంగా ముస్తాబు చేశారు. గ్రామోత్సవంలో భాగంగా రాత్రి గరుత్మంతునిపై వేంకటేశ్వరస్వామి ఉత్సవవిగ్రహాన్ని ఊరేగించారు. నిర్వాహకులు చిన్ని, ఊరిబిండి మునిశేఖర్,శివయ్య, మునిరత్నం పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం తిరుచ్చిపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవలనంతరం ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పెరటాసి మూడవ శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు దీపారాధన చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించాక ఉత్సవర్లను తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేసి ఊరేగించారు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేరూరు చెరువుకు టీడీపీ నేతల జలహారతి



తిరుపతిరూరల్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): పేరూరు చెరువు వద్ద గ్రామటీడీపీ అధ్యక్షుడు నాగూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం జలహారతి నిర్వహించారు. తొండవాడ స్వర్ణముఖి నది సప్లై ఛానల్స్ మధ్యలో పలుచోట్ల అడ్డుగా మొక్కలను ఎక్సవేటర్ సాయంతో తొలగించి నీరుసాఫీ చేరేలా చేశారు. కాలువగుండా నీరు చేరుతుండడంతో సంతోషాన్ని వ్యక్తపరుస్తూ జలహారతి నిర్వహించారు. నాయకులు కాయం వెంకటేష్, దామినేటి నాగరాజు, గోపి, లక్ష్మీప్రసన్న, చిన్ని, మహేష్, శశిధర్, కిషోర్, చంద్ర, మునిరాజ పాల్గొన్నారు.

ఏఐ,డిజిటల్ టెక్నాలజీదే భవిత



జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

చంద్రగిరి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో సుస్థిర శక్తి రంగంలో ఏఐ, డిజిటల్ టెక్నాలజీల పాత్ర కీలకమని వక్తలు పేర్కొన్నారు. శనివారం ఎ.రంగంపేటలోని మోహన్ బాబు యూనివర్సిటీలో ఐఈఈఈ పీఈఎస్, పీఈఎల్ఎస్, ఐఏఎస్ జాయింట్ చాప్టర్(హైదరాబాద్) ఆధ్వర్యంలో సదస్సు జరిగింది.. ఈసందర్భంగా జాయింట్ చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ వి.ఎస్.కె. మూర్తి బలిజేపల్లి మాట్లాడుతూ మొదటిసారి మూడు ఐఈఈఈ సొసైటీలు ఒకే వేదికపై విద్యార్థులకు కొత్త అవకాశాలు అందిస్తున్నాయన్నారు. ఎంబీయూ ఉపకులపతి ప్రొఫెసర్ నాగరాజ్ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి గురించి వివరించారు, ప్రొఫెసర్ కల్యాణ్ కుమార్ సేన్ (యూఎస్), టీసీఎస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ బాల పెద్దిగారి,సాయినాథ్ బంధకవి, డాక్టర్ కేరామకృష్ణ , పి. బాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. గ్లోబల్ లీడర్ల ఉపన్యాసాలు, నైపుణ్యాభివృద్ధి సెషన్లు, కెరీర్ మెంటరింగ్, నెట్వర్కింగ్ అవకాశాల ఆకర్షణలుగా నిలిచాయి.

శ్రీవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ భజంత్రి-ఎల్.మురుగన్- పన్నీర్ సెల్వం



సతీష్

తిరుమల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భజంత్రీ, కేంద్రమంత్రి ఎల్.మురుగన్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీరు సెల్వం, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తమిళ సినీ నటుడు సతీష్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



పాకాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు మ్యాంగోనగర్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో మద్యం దుకాణం పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం స్థానికులు గుర్తించారు. సీఐ సుదర్శన ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం రుయాసుపత్రికి తరలించారు. మృతునికి సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. నలుపు జీన్ ప్యాంట్, అదేరంగు చెక్స్ క్రీమ్ కలర్ షర్టు ధరించి ఉన్నాడు. వివరాలు తెలిస్తే తెలియజేయాలని సీఐ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పాకాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మదుసూదన్‌రావ్ డిమాండు చేశారు. శనివారం ఆయన పాకాలలో విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన వారిని అరెస్ట్ చేసి శిక్షించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

వాహనాల తనిఖీ

ఎర్రావారిపాలెం, అక్టోబర్4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం పోలీసులు పలు వాహనాలను తనిఖీ చేశారు హెల్మెట్ ధరించని వాహనచోదకులకు జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలను పరిశీలించారు. ఇదే సమయంలో మహిళలకు శక్తి యాప్ పట్ల అవగాహన కల్పించారు. ఎస్సై బాలకృష్ణయ్య పాల్గొన్నారు.

తిరుమలలో అస్వస్థతకు గురై వృద్ధుడి మృతి



తిరుమల, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన వైనమిది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. సుమారు 80 ఏళ్ల వయసున్న ఓ వృద్ధుడు తిరుమలలోని ప్రధాన కల్యాణకట్ట ముందున్న షెడ్‌లో శుక్రవారం రాత్రి పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుని వద్ద ఆధారాలు లేకపోవు. వివరాలు గుర్తిస్తే 94407 96769 నంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. గురువారం హుండీ ఆదాయం రూ.2.60 కోట్లు లభించింది. శుక్రవారం శ్రీవారిని 73,581 మంది దర్శించుకోగా 28,976మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

రూరల్ ఎంఈవో-1గా పద్మజ బాధ్యతల స్వీకారం



పద్మజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తిరుపతి రూరల్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి):రూరల్ మండల రెగ్యులర్ ఎంఈవో-1గా బి.పద్మజ శనివారం బాధ్యతలు చేపట్టారు. కడపజిల్లా సిద్దవటం నుంచి ఆమె బదిలీపై వచ్చారు. ఇంతకుముందు ఇన్‌చార్జిగా వ్యవహరించిన మహమ్మద్ రఫీ తిరిగి పాకాల గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎంగా వెళ్లారు. కొత్త ఎంఈవోని పలువురు టీచర్లు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో అభినందించారు. ఎంఈవో-2 శంకరయ్య పాల్గొన్నారు.

గోకులం షెడ్లపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న గంగరాజు

భాకరాపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట గ్రామ పంచాయతీలో మంజూరైన గోకులం షెడ్‌లపై లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ గంగరాజు శనివారం విచారణ జరిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గోకులం షెడ్ల నిర్మాణాలకు గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు తొలి విడతలో 14 మందికి మంజూరు చేశారు. అయితే జాబితాలో 15 మంది లబ్ధిదారుల పేర్లు ఉండడంతో ఉపాధి సిబ్బంది ట్యాంపరింగ్ చేసి ఒకరి పేరు చేర్చారని లోకాయుక్తకు భాకరాపేటకు చెందిన జంగాల యశ్వంత్ ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణకు వచ్చిన అధికారి రికార్డులు పరిశీలించారు. తొలుత ఇచ్చిన 14 మందితోపాటు మరొకరి పేరు కూడా విడిగా గ్రామ పంచాయతీ తీర్మానం ఇచ్చినట్లు రికార్డుల్లో నమోదై ఉన్నట్లు గుర్తించారు. అనంతరం యశ్వంత్‌ను, ఉపాధి సిబ్బందిని విచారించి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, కార్యదర్శి రామ్మోహన్, సర్పంచ్ భూపాల్, పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సుమన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం సినీ నటుడు సుమన్ దర్శించు కున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వా గతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనా నంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో భారీవర్షం

రూరల్ మండలంలో 85.8 మి.మీ. నమోదు - కృష్ణాపురంలో కూలిన గుడిసె





తిరుపతి రూరల్ మండలం సుబ్బయ్యకాలనీ రహదారిలో చేరిన వర్షపు నీరు - తిరుచానూరులో జలమయమైన రహదారి

తిరుచానూరు,తిరుపతి రూరల్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా చినుకు కరువైన నేపథ్యంలో శనివారం రూరల్ మండలంలో 85.8 మి.మీ. వర్షపాతం నమోదయింది. వేకువజాము నుంచి ఉదయం 11గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. తిరునాచానూరు మార్కెట్‌యార్డు, హైవే సమీపాన నీరు పేరుకుపోవడంతో చేరడంతో ఇక్కట్లు పడ్డారు. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు వచ్చింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆర్సీపురానికి వెళ్లే మార్గం ఇబ్బందికరంగా తయారైంది. మధు బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా రోడ్డుపై నీరు భారీగా చేరింది. రహదారిని ఆనుకుని ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి వర్షపునీరు చేరి నిండిపోయింది. పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. వేదాంతపురం అగ్రహారం సర్కిల్‌లో అవిలాల చెరువు నుంచి వర్షపు నీరు రహదారిపై ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. సుబ్బయ్య కాలనీ మార్గంలో మట్టిరోడ్డులో కూడా అవస్థలు తప్పలేదు. **చంద్రగిరి:** ఏ.రంగంపేట పంచాయతీ కృష్ణాపురం హరిజనవాడలో వెంకటరమణకు చెందిన పూరిగుడిసె నేలకూలింది. ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తనను ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నాడు. **రామచంద్రాపురం:** మండలంలో శనివారం వర్షం ఊరటనిచ్చింది.కొన్ని చోట్ల బలమైన వర్షం కురవడంతో పొలాల్లో నీరు చేరింది. కూలీలు, చిన్నపాటి వ్యాపారస్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. **భాకరాపేట:** దేవరకొండ పంచాయతీ మల్లెలవాండ్లపల్లెలో వర్షానికి వీధులన్నీ చెరువును తలపించాయి. డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, టీడీపీ నేత కృష్ణమూర్తి సహకారంతో నీళ్లన్నీ వెళ్లిపోయేలా కాలువల పూడిక తీయించారు. **ఎర్రావారిపాలెం:** తలకోన ఏరు ప్రవహించడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోటకాడ పల్లె, అయ్యాగారిపల్లె, ఒఎస్ గొల్లపల్లె,పాఠశాలకు వెళ్లాల్సిన వీరు వలసపల్లె-కోటకాడపల్లె వద్ద తలకోన ఏరు దాటడానికి అవస్థలు పడ్డారు. పరస్పరం సహకరించుకుంటూ బయటపడి స్కూళ్లకు చేరుకున్నారు.



మల్లెలవాండ్లపల్లెల్లో పూడిక తీత



తలకోన ఏరులో ఉపాధ్యాయుల అవస్థలు



కూలిన గుడిసె ముందు కుటుంబంతో వెంకటరమణ

ఆటో కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆటో కార్మికులు

చంద్రగిరి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆటో, టాక్సీ, క్యాబ్ కార్మికుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని ఆర్డీవో రామ్మోహన్ అన్నారు. శనివారం చంద్రగిరిలో కూటమి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో వాహనసేవలో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 3499 మంది ఆటో కార్మికులకు రూ.5.15 లక్షల మేర జమ చేసిందని తెలిపారు. రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. అనంతరం ఆటో కార్మికులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఖాతాలకు సాయం జమ కావడంతో ఆటో డ్రైవర్లు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఆటో, టాక్సీ, క్యాబ్, యజమానులు, కార్మికులు, టీడీపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య, రవాణా శాఖ అధికారి. శ్రీనివాస రావు, ఏఎంసీ ఛైర్మన్ ఎస్ గౌస్ బాషా, టీడీపీ సీనియర్ నాయకులు రమేష్ రెడ్డి, తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 26వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శన టిక్కెట్ల ద్వారా 184 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,644, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 1.996 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,489మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,099, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 367మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 289 మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 83మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,601 విక్రయమయ్యాయి.

10నుంచి ఉచిత కంటి ఆపరేషన్లు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఆప్తమాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 10నుంచి 17వరకు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీవారి వైద్యసేవలో పథకంలో భాగంగా హైదరాబాదుకు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎ.వెంకటాచలం రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా క్యాటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహిస్తారని వివరించారు. ఆధార్, ఆరోగ్యశ్రీకార్డు, తెలుపురంగు రేషన్‌కార్డు తీసుకొని స్విమ్స్‌లోని పద్మావతి ఆస్పత్రి మెడికల్ రికార్డు విభాగంలో ఓపీ నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం ఆప్తమాలజీ విభాగం 45 రూమ్ వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వకు సంప్రదించాలని కోరారు. టీటీడీ రెగ్యులర్, పెన్షనర్లు, ఎస్.ఎల్.ఎం.పి.సి, సొసైటీలోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం పంచాయతీ పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన రవిచంద్ర (35) కుటుంబకలహాల నేపథ్యంలో గత నెల 26వ తేదీన పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు గమనించి చెన్నైలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న దాన పథకానికి శనివారం బెంగళూరుకు చెందిన ముక్తేశ్వర్, నాగరాణి రూ.1,00,116ను విరాళంగా అంద జేశారు. చెక్కును ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామిఅమ్మవార్ల అంతరాయల దర్శనం కల్పించారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరుడికి శనివారాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ, గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారికి అభిషేకించారు.

వైసీపీ నేత దౌర్జన్యంపై రైతు ఫిర్యాదు



ధ్వంసమైన విద్యుత్ స్తంభం

శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత తమపై దౌర్జన్యానికి పాల్పడటమే కాకుండా విద్యుత్ స్తంభాన్ని ధ్వంసం చేశాడని రైతు వెంకటాద్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం ఈ ఘటన జరిగింది. తొట్టంబేడు మండలం బోనుపల్లికి చెందిన వెంకటాద్రికి గ్రామ శివార్లలో వ్యవసాయ భూమి ఉంది. అక్కడ సాగు కోసం 2021, ఏప్రిల్ 5న రూ.32,500ను విద్యుత్‌శాఖకు చలానాగా చెల్లించాడు. సర్వే చేసిన అధికారులు అప్పట్లో స్తంభాలను నాటారు. తీగలు ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో వెంకటాద్రి ఇటీవల అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడంతో వారం రోజుల క్రితం తీగలు ఏర్పాటు చేసేందుకు శనివారం అధికారులు పొలం వద్దకు వచ్చారు. దీంతో తమ పొలంలో విద్యుత్ తీగలు లాగవద్దంటూ వైసీపీ నాయకుడు, అతని అనుచరులు అభ్యంతరం తెలిపారు. నాలుగున్నర సంవత్సరాల క్రితం స్తంభాలు నాటితే ఇప్పుడు ఎందుకు అభ్యంతరం తెలుపుతున్నారని అధికారులు నిలదీశారు. ఈ క్రమంలో తీగలు ఏర్పాటు విషయమై ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. వైసీపీ నాయకుడు విద్యుత్ స్తంభాన్ని ధ్వంసం చేయడంతో పాటు తన కుమారుడు బాలకృష్ణతో పాటు దాడికి పాల్పడినట్లు వెంకటాద్రి చెప్పారు. ఈ మేరకు తండ్రీకొడుకులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు. వైసీపీ నాయకుడు చెంగయ్య కూడా తనపై దాడి జరిగిందని ఆస్పత్రిలో చేరాడు. ఈక్రమంలో వెంకటాద్రి ఎస్ఐ బలరాంకు ఫిర్యాదు చేశాడు.

జాతీయ సహకార సదస్సుకు పకడ్బందీగా ఏర్పాట్లు



అధికారులతో జూమ్ మీటింగ్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాజ్‌హోటల్ వేదికగా ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సహకార వర్క్‌షాప్‌నకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, ఎలాంటి లోటుపాట్లకూ తావులేకుండా చూడాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం ఆయన సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. సహకార మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఇందులో సమీక్షించనున్నట్లు తెలిపారు. జాతీయ సహకార మంత్రిత్వ శాఖ సెక్రటరీ ఆశీష్ కుమార్ బుటాని, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సంయుక్త కార్యదర్శి సిద్ధార్థ్‌జైన్, అగ్రికల్చర్ అండ్ సెరికల్చర్ కోఆపరేషన్, మార్కెటింగ్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, సహకార కమిషనర్ బాబు, సహకార శాఖ కార్యదర్శులతోపాటు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సహకార శాఖ సీనియర్ అధికారులు, ప్రతినిధులు హాజరవుతారన్నారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, కోఆపరేటివ్ అధికారిణి లక్ష్మి పాల్గొన్నారు.

స్టేషన్ అభివృద్ధి పనులు జూన్‌లోపు పూర్తిచేయండి



తిరుపతి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న రణధీర్‌రెడ్డి

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను వచ్చే ఏడాది జూన్ లోపు పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే నిర్మాణాల విభాగం ముఖ్య పరిపాలన అధికారి ఎం.రణధీర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో రెండు వైపులా జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ ఏడాది డిసెంబరు చివరి కల్లా దక్షిణం వైపు వున్న భవనాన్ని, రెండు ఎయిర్ కాన్ కోర్సులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రేణిగుంట సంత వద్ద జరుగుతున్న బైపాస్ రైలు మార్గం నిర్మాణాలను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఈ సూర్యనారాయణ, అధికారులు కె.వామనమూర్తి, దరూరు ప్రభాకర్, డి.మాధవరావు, సురంజన్ రెడ్డి, బండ్ల నరేష్, బండ్ల లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి రూ.5లక్షల విరాళం



తిరుపతి(జీవకోన), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష పిలుపునిచ్చారు. శనివారం గంగమ్మ ఆలయానికి మేయర్ భర్త, వైష్ణవి ఆస్పత్రి అధినేత డాక్టర్ మునిశేఖర్, ఇతర కుటుంబసభ్యులతో కలిసి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చేతులమీదుగా గంగమ్మ ఆలయానికి రూ.5లక్షల విరాళాన్ని ఈవోకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయానికి అవసరమైన స్థలం కొనుగోలు కోసం ఈనగదు వినియోగించాలని అధికారులను కోరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ గురుమూర్తి, డాక్టర్ హేమకుమార్‌రెడ్డి, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రమేష్, మునెయ్య, సురేష్‌యాదవ్, చింతా రమేష్, అంకయ్య, వెంకటేష్, బత్తెయ్య, పురుషోత్తం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నా ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేశారు

వైసీపీ, జనసేన నేతలపై ఫిర్యాదు



ఈస్ట్ సీఐకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు లక్ష్మీరెడ్డి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ, జనసేనకు చెందిన కొందరు ఆకతాయిలు తన ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని శనివారం తిరుపతి ఈస్ట్ పోలీసులకు లక్ష్మీరెడ్డి అనే మహిళ ఫిర్యాదు చేశారు. గతంలో జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్‌పై ఫిర్యాదు చేసి లక్ష్మీరెడ్డి వార్తల్లోకెక్కిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. తిరుపతి అర్బన్ పరిధిలోని కొరమేనుగుంటలో కాపు రమున్న లక్ష్మీరెడ్డి ఫొటోలను, వీడియోలను తిరుపతికి చెందిన జనసేన నేత దినేష్ జైన్, హరిశంకర్, ఘనితో పాటు వైసీపీ నాయకుడు సురేష్‌లు కలసి గత కొంత కాలంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఈ విష యంలో వైసీపీ నేత సురేష్‌కు జనసేన నాయకులు సహకారం అందించి తన పరువుకు భంగం కలిగిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. తక్షణం ఫోటోలు, వీడి యోలు తొలగించాలని పలుసార్లు విజ్ఞప్తిచేసినా పట్టించుకోకపోగా బెదిరిస్తున్నారని వాపోయారు. వైసీపీ నేతతో పాటు జనసేన నాయకులపై తక్షణం కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని ఆమె సీఐకు విజ్ఞప్తి చేశారు.

తిరుపతి

సీఎం పర్యటనపై అప్రమత్తంగా ఉండండి

● విద్యుత్ ఎస్ఈ చంద్రశేఖర్ రావు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 7న నారావారిపల్లి పర్యటన సందర్భంగా విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తిరుపతి సర్కిల్ ఎస్ఈ వి.చంద్ర శేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష చేశారు. సీఎం పర్యటలో విద్యుత్ అంతరాయాలు రాకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. రెండు రోజుల పాటు అధికారులు చేపట్టాల్సిన విధులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు వాసవీలత, చిన్నరెడ్డెప్ప, ఏఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాన్‌టీచింగ్ స్టాఫ్ సావనీర్ ఆవిష్కరణ

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పద్మావతి మహిళా కళాశాల రిటైర్డ్ పిన్సిపాల్ కమల మీనన్ రూపొందించిన నాన్ టీచింగ్ స్టాఫ్ సావనీరును ఆదివారం ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక కపిలతీర్థం సమీపంలోని గోల్డెన్ తులిప్ హోటల్‌లో జయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూర్వ బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి సేకరించిన కథలు, జ్ఞాపకాలు, ఛాయాచిత్రాల సేకరణతో ఈ సావనీరును రూపొందించినట్లు వివరించారు.

ఘనంగా ప్రపంచ జూ కీపర్స్‌డే



అనిమల్ కీపర్‌కు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జూ క్యూరేటర్ సెల్వం

మంగళం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ జూపార్కులో శనివారం ప్రపంచ జూ కీపర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ సెల్వం మాట్లాడుతూ జూలో జంతువుల సంరక్షణలో అనిమల్ కీపర్స్ వెన్నెముకలాంటి వారన్నారు. జంతువుల సంరక్షణకు అనిమల్ కీపర్స్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్, జూ డాక్టర్ అరుణ్‌కుమార్, ఎడ్యుకేషన్ ఆఫీసర్ దీపక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జోరువానలోనూ నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : తిరుపతి తిరుమాడవీధుల్లో శనివారం జోరువానలోనూ నగర సంకీర్తన సాగింది. భజన మండలి కళాకారులు వర్షం కురుస్తున్నా గొడుగులు ఆధారంగా చేసుకుని గోవింద నామాలు పలుకుతూ సంకీర్తన చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, మునినాథరెడ్డి, చెంగారెడ్డి, పళని ఆచారి, రాజశేఖరరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, వెంకటేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, కళ్యాణి, సుశీల, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వర్ష బాధితులకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు

తిరుపతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు (0877 22256776, 9000822909)లో సంప్రదించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సాయమందించేందుకు సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు. 24 గంటలూ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని వివరించారు.

అలిపిరి పాదాల చెంత భక్తజన సందోహం





తిరుపతి(కల్చరల్), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : తిరుపతి అలిపిరి శ్రీవారి పాదాల మండపానికి భక్తులు పోటెత్తారు. పెరటాసీ మాసం మూడో శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. శ్రీవారి పాదాల వద్ద పిండి దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఇక్కడి మండపంలోని వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఇక అధిక సంఖ్యలో భక్తులు పాదాల మండపం వద్దకు తరలిరావడం.. మరోపక్క ఇటువైపుగా తిరుమలకు వెళ్లే భక్తుల రాకతో ఈ ప్రాంతంలో రద్దీ నెలకొంది.

తిరుపతిలో కేంద్ర మంత్రి పర్యటన

● అంబేడ్కర్, పూలే ఫౌండేషన్‌ను ప్రారంభించిన రాందాస్ బందు అత్వాలే



కేంద్ర మంత్రికి వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేస్తున్న పరసారత్నం

తిరుపతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర న్యాయ, సాధికార శాఖ మంత్రి రాందాస్ బందు అత్వాలే శనివారం తిరుపతిలో పలు ప్రారంభోత్సవాలలో పాల్గొన్నారు. డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ జ్యోతిరావు పూలే ఫౌండేషన్ (ఏపీఎఫ్) కార్యాలయాన్ని స్థానిక మారుతి నగర్‌లోని మాజీ మంత్రి పరసారత్నం నివాసంలో ప్రారంభించారు. అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ ఏర్పాటు చేయడం ఆదర్శ నీయమన్నారు. పరసారత్నం లాంటి వారు ఫౌండేషన్ ఏర్పాటు చేయడం ఆదర్శ ప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి శివ నాగేశ్వరరావు, ఆంధ్ర, తెలంగాణ ఎంఎస్ఎంఈ ఛైర్మన్ మంజుల, తిరుపతి మాజీ ఎమ్మెల్యేలు ఏ.మోహన్, సుగుణమ్మలు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళా ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి గంగమ్మగుడి ఛైర్మన్ మహేష్ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొని అంబేడ్కర్ పూలే ఫౌండేషన్ సమాజంలో మార్పుకు చిరునామా కావాలని ఆకాంక్షించారు. ఏపీఎఫ్ సభ్యులు పరసా శాలిని, చింతల సతీష్‌చంద్ర, కె.కుమార్‌రెడ్డి, శరత్‌బాబు,నీరుగట్టు నగేష్, ఈశ్వరయ్య, మునీంద్ర, జగదీష్, రఘునాథ్ సింగ్, జనసేన నేతలు నాగార్జున, విజయ్ ఉత్తరాది, ఎం.నందిని, ఆర్.ఎస్ చౌదరి, డాక్టర్ హరి, తలారి సూరిబాబు, రాజేష్, భరత్ నాయక్ పాల్గొన్నారు.

75.8మిల్లీమీటర్ల వర్షపాతం

● తిరుపతిలో భారీ వర్షం

● జలమయమైన లోతట్టుప్రాంతాలు



నీటితో నిండిపోయిన డీఆర్ మహల్‌కు వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జి

తిరుపతి అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం నగరాన్ని తాకడంతో ఉదయాత్పూర్వం 4.30గంటలకు ఉరుములు, మెరుపులతో కూడిన జోరు వర్షం మొదలైంది. ఉదయం 10గంటల వరకు కొనసాగింది. 75.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బడి పిల్లలు, ఉద్యోగులు, కూలీలు అవస్థలు పడ్డారు. పురవీధులు ఏరులను తలపించాయి. రైల్వే అండర్ బ్రిడ్జిలు పూర్తిగా మునిగిపోయాయి. లక్ష్మీపురం కూడలి, పద్మావతి పురం, తిరుమల బైపాస్‌రోడ్డు, రేణిగుంట ప్రధాన రహదారి, మాస్టర్ ప్లాన్ రోడ్లు జలమయమయ్యాయి. దీంతో పలు ప్రాంతాలలో ట్రాఫిక్ స్తంభించింది. ఆర్టీసీ బస్టాండు చెరువును తలపించింది. ఇందిరా ప్రియదర్శిని మార్కెట్‌లో నీరు నిలిచిపోయింది. కరకంబాడి రోడ్డులో డ్రైనేజీ పొంగిపొర్లడంతో వాహనాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. మురుగు కాలువల్లో ఉధృతంగా నీరు ప్రవహించడంతో మంగళం చెన్నయిగుంట చెరువు నిండి మొరవపారింది. కేబీఆర్ నగర్ లోని లోతట్టుప్రాంతాలను నీరు చుట్టుముట్టింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. పాతపడిన గోడలు కూలిపోయాయి. అక్కడక్కడా చెట్లు నేలకూలాయి.







లక్ష్మీపురం సర్కిల్ వద్ద వర్షపు నీటిలో వెళుతున్న కారు - ఆగిపోయిన ఆటోను తోసుకెళ్తున్న యజమాని - రుయాలో రోగుల అవస్థలు

ఆటో డ్రైవర్ కిడ్నాప్

● ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్లాట్ల విషయంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఆటో డ్రైవర్‌ను కిడ్నాప్ చేసిన నిందితులపై తిరుపతి రూరల్ పోలీసులు కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ చిన్న గోవిందు కథనం మేరకు.. రూరల్ పరిధిలోని లింగేశ్వర నగర్‌లో కాపుర మున్న ఉమామహేశ్వరి స్థానికంగా ఉన్న కొంత మంది వద్ద నుంచి ప్లాట్లు అమ్ముతానని నమ్మబలికి డబ్బులు వసూలు చేసింది. బాధితులు కొందరు ఆమెను తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుసార్లు డిమాండ్ చేశారు. ఈ విషయంలో అదే లింగేశ్వరనగర్‌లో కాపురమున్న చిట్టిరాయల్ జోక్యం చేసుకుని తీసుకున్న డబ్బులు ఇవ్వకుంటే అంతు చూస్తానని బెదిరించాడు. దీనిపై కేశవాయన గుంటకు చెందిన ఆటో డ్రైవర్ ప్రకాష్ తెలిసినవారి వద్ద చిట్టిరాయల్ అంతుచూస్తానని మాట్లాడాడు. ఈ విషయం చిట్టిరాయల్ దృష్టికి వెళ్లింది. రెచ్చిపోయిన చిట్టిరాయల్ అనుచరులు దాదాపు ఆరుగురు ఆటో డ్రైవర్ ప్రకాష్‌ను శుక్రవారం కిడ్నాప్ చేశారు. కారులో ఎక్కించుకుని కర్రలు, ఇనుప రాడ్లతో తీవ్రంగా కొట్టి రక్త గాయాలు చేశారు. తర్వాత ఎంకేనాయుడు కాలనీలోని చిట్టిరాయల్ కార్యాలయానికి తీసుకొచ్చారు. అక్కడ ఓ గదిలో బంధించారు. అక్కడా చితకబాదారు. కులంపేరుతో దూషించారు. బాధితుడు ప్రకాష్ శుక్రవారం అర్ధరాత్రి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తూరు వార్తలు

గ్రామీణ రోడ్లకు మోక్షం ఎప్పుడో?




అధ్వానంగా ఉన్న ఎగవ గూళూరు రోడ్డు

పుత్తూరు టౌన్, అక్టోబర్ 4(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వం వచ్చినా పల్లె ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదు. గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వానంగానే ఉన్నాయి. చిన్నపాటి వర్షాలకే గ్రామీణులు రాకపోకలు సాగించడానికి నరకయాతనను అనుభవిస్తున్నారు. తిరుపతి- చెన్నై జాతీయ రహదారి నుంచి తడుకు, ఎగవగూళూరు, దళితవాడ, దిగవ గూళూరు, పొట్టిగుట్టలు, సిరుగురాజుపాళెం ప్రజల కోసం అప్పటి ఎమ్మెల్యే ముద్దుకృష్ణమ రింగ్ రోడ్డు నిర్మించారు. కాలక్రమేణా యేటా నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో గుంతలమయంగా మారింది. సంబంధింత గ్రామప్రజలు ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. అలాగే తిరుపతి- చెన్నై రహదారిలోని వేణుగోపాలపురం, వీఎస్ఎస్‌పురం మధ్య రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు మీదుగా సదాశివేశ్వర కోనకు వెళ్లాల్సి ఉంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

భక్తులతో కోలాహలంగా అప్పలాయగుంట



మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు




పిండి దీపాలు వెలిగిస్తున్న మహిళలు - దర్శనంకోసం వేచి ఉన్న భక్తులు

వడమాలపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయ గుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పెరటాసి నెల మూడవ శనివారం కావడంతో భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కోలాహలంగా మారాయి. మహిళలు పిండి దీపాలు వెలిగించారు. మొక్కుబడి ఉన్న భక్తులు తలనీలాలు సమర్పించారు. అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో ముడుపులు చెల్లించారు. అంతకుముందు వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకార్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో అధిష్ఠింపజేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతి, ఆండాల్ సమేత శ్రీవారిని మేళతాలాలతో మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి వేణుగోపాల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● వర్షం ఎఫెక్ట్

మూలకోన ఎకో ఫారెస్టు చెక్ పోస్టు మూసివేత

పుత్తూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం తెల్లవారు జాము 41.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. దీంతో 34 చెరువులకు నీరు చేరుతోందని నీటి పారుదలశాఖ అధికారి పరుశురామ్‌నాయక్ తెలిపారు. మరో రెండు రోజులు వర్షం పడితేకాని చెరువుల కలుజులు పారవని అన్నారు. వర్షం కారణంగా పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని అధికారులు తెలిపారు. అయితే మూలకోన జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పర్యాటలనకు అనుమతించడం లేదని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఇటీవల ప్రారంభించిన ఎకో ఫారెస్టు చెక్‌పోస్టును మూసివేశామని అటవీశాఖాధికారి మాధవి తెలిపారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో కారణి, బీఎన్‌కండ్రిగ గ్రామాల్లోని వేంకటేశ్వరుడి ఆలయాల్లో పెరటాసి నెల మూడో శనివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలమూర్తులకు అభిషేకాలు చేసి పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని శిక్షించాలి

సత్యవేడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటరమణ డిమాండ్ చేశారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణాచలం మాట్లాడుతూ దేవళంపేట ఘటనపై ఎస్సీ కమిషన్ సుమోటోగా తీసుకుని విచారణ జరిపి నిందితులను శిక్షించాలని కోరారు. మాణిక్యం, గోవిందయ్య, రవి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ఏర్పేడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి అన్నారు. శనివారం సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్ సేవలో భాగంగా వారి ఖాతాల్లో రూ.15వేలు జమచేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పేడులో ఆటో డ్రైవర్లతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు మునెయ్య, కృష్ణవేణి, కందాటి మహేష్‌రెడ్డి, సదాశంకర్‌నాయుడు, మునీంద్రయాదవ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఘనస్వాగతం

రేణిగుంట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఘన స్వాగతం లభించింది. తిరుపతిలో జరిగే 'ఆటో డ్రైవర్ సేవలో' పాల్గొనేందుకు శనివారం మధ్యాహ్నం విజయవాడ నుంచి ఇండిగో విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన తిరుపతి చేరుకున్నారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం 5 గంటలకు ఇండిగో విమానంలో హైదరాబాదుకు ప్రయాణమయ్యారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

కారు ఢీకొని వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... బిరదవాడ గ్రామానికి చెందిన సుందరం(68) శుక్రవారం రాత్రి నాయుడుపేట పట్టణంలో పనులు ముగించుకొని ఆటోలో బిరదవాడకు వెళ్లాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్లే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుందరంను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై తీసుకెళ్లుతుండగా మార్గమధ్యంలో సుందరం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

చిల్లకూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీపనూరు గ్రామ సమీపంలోని రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే జీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చెన్నై వైపు వెళుతున్న రైల్లో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుదర్శనరావు తెలిపారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

చిల్లకూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాల పాడు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన సుధాకర్, పరుశురామ్ మధ్య పాతకక్షలు ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. సుధాకర్ వర్గానికి చెందిన మణికంఠయ్య, చిరంజీవి, పరశురామయ్య, వెంకటరమణయ్య, పరశురామ్ వర్గానికి చెందిన మనోజ్, యశ్వంత్, జనార్దన్, పోలయ్య, వెంకటరమణయ్య, వజ్రమ్మ పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో సుధాకర్, పరుశు రామ్‌లకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌కు మెమో

గూడూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మనేటూరు సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్‌కు శనివారం ఇన్‌చార్జి ఎంపీడీవో కౌసల్య మెమో జారీ చేశారు. సచివాలయ పరిధిలో 64 మందికి వెల్ఫేర్ అసిస్టెంట్ రాకేష్ పింఛన్ నగదు అందజేయలేదని లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాకేష్‌కు మెమో జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో చెప్పారు.




సిద్దాగుంటలో దుక్కి చేసిన ప్రభుత్వ భూమి - గొల్లగుంటలో అటవీ భూమిని చదును చేస్తున్న ఎక్స్‌వేటర్

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా

● ఆక్రమించి అమ్మేస్తున్న అక్రమార్కులు

● చోద్యం చూస్తున్న అధికారులు

బాలాయపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపించినా కబ్జా చేసి చదును చేసేస్తున్నారు. వెంకటగిరి మండలం బంగారుపేట నుంచి బాలాయపల్లి మండలంలోని నిడిగల్లుకు వెళ్లే మార్గంలోని సిద్దాగుంట గ్రామం పరిధిలో తారురోడ్డు ఆనుకుని ఉన్న లక్షల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిపై కన్నేసిన వేసిన ఆక్రమణదారులు కబ్జా చేసి చదును చేసేశారు. సిద్దాగుంట గ్రామ సర్వే నంబరు 113.7లో ఉన్న ప్రభుత్వ భూమి సుమారు 20 ఎకరాలు కూటమిని గత ఏడాది వెంకటగిరి పట్టణానికి చెందిన కొందరు ఆక్రమించి పట్టపగలే ఎక్స్‌వేటర్‌తో చదును చేశారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులే అడ్డుకోవడంతో ఆక్రమణదారులు కొన్నాళ్లు మిన్నకుండిపోయారు. ఇటీవల రాత్రిపూట భూమిని దున్ని సాగులోకి తెచ్చారు. అదేవిధంగా చిలమనూరు పంచాయతీ గొల్లగుంటలో అటవీ భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంది. వెంకటగిరి - నాయుడుపేట రహదారికి సమీపంలోని భూమి కావడంతో ఆక్రమణదారుల కన్ను పడింది. గత మూడు రోజులుగా పగలు, రాత్రి ఎక్స్‌వేటర్‌తో మొక్కలు తొలగించి చదును చేస్తున్నా అటవీశాఖ అధికారులు అటువైపు చూడలేదు. ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్నారని వీఆర్వోకు సమాచారం ఇవ్వగా ఆయన వెళ్లి పరిశీలించారు. ఆక్రమిత భూమి రెవెన్యూశాఖ పరిధిలో లేదని మిన్నకుండిపోయారు. పేదలు సాగు చేసుకుని జీవనం సాగిస్తుంటే అడ్డుకునే అటవీశాఖ అధికారులు సుమారు పది ఎకరాల పైబడి భూమిని ఆక్రమించి చదును చేస్తున్నా పట్టించుకోకుండా చోద్యం చూడడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అటవీశాఖ అధికారులతో సన్నిహితంగా ఉండే ఓ వ్యక్తి దగ్గరుండి భూమిని చదును చేయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ఊట్లపల్లి పంచాయతీలో మా ఊరమ్మ చెరువు చివరన తెలుగంగ కాలువ ఆనుకుని ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీంతో అదే వ్యక్తి మరో రెండెకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇటీవల ఎక్స్‌వేటర్‌తో చదును చేస్తుండగా గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వీఆర్వో మోహన్ వెళ్లి అడ్డుకుని ఎక్స్‌వేటర్‌ను పంపించేశారు. ఇదే పంచాయతీలోని వడ్డిపాళెం సమీపంలో సర్వే నంబరు 70లో ఉన్న ప్రభుత్వ భూమిని వెంకటగిరి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి ప్లాట్లుగా వేసి లక్షల రూపాలయలకు అమ్ముకుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పాపిరెడ్డిపల్లి వడ్డిపాళెం సమీపంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి చెట్లు తొలగించిన కబ్జాదారులు

అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వ కృషి: పాశం



ఆటో డ్రైవర్లకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతా కుమారి

గూడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక పోటుపాళెం జాతీయ రహదారి కూడలి నుంచి ఎన్డీఏ నాయకులు ఆటోడ్రైవర్లతో కలిసి ర్యాలీ ప్రారంభించి ఆదిశంకర యూనివర్శిటీ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే ఆటో నడుపుతూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆదిశంకర యూనివర్శిటీలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ ముందుకు వెళుతోందన్నారు. ప్రధాని మోదీ రాష్ట్రాభివృద్ధికి ఎంతో సహకరిస్తున్నారని, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీల్లో లేనప్పటికీ ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏడాదికి రూ.15వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. గూడూరు నియోజకవర్గ పరిధిలో 2455 మందికి రూ.3.68 కోట్లు అందజేయడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నామ మాత్రంగా కొంతమందికి మాత్రమే రూ.10వేలు అందజేసి చేతులు దులుపుకుందన్నారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, ఆరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్‌రహీం, వెంకటేశ్వర్లురాజు, తీగల చంద్రశేఖర్, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పేటేటి ప్రకాశ్ రావు, రవాణాశాఖ అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

హామీలకు మించి సంక్షేమ పథకాలు: విజయశ్రీ

సూళ్లూరుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడికే సాధ్యమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం సూళ్లూరుపేటలోని శేషసాయి కల్యాణ మండపంలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఆటో ఎక్కి కొంతదూరం ప్రయాణించారు. అనంతరం ఆటో డ్రైవర్లతో కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చడమే కాకుండా ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు అందించడం హర్షణీయమన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ హామీలను నెరవేర్చడంతో పాటు అభివృద్ధి చేయాలంటే బాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, రైతు సహకార సేవా సంఘ అధ్యక్షుడు ఏజీ కిషోర్, టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

జాతీయ రహదారిపై ఆగిపోయిన లారీ వెనుక నుంచి ఢీకొన్న కంటైనర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

తడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఆగిపోయిన లారీని వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొన్న ఘటన తడ మండల పరిధిలోని నిప్పో పరిశ్రమ ఎదురుగా శనివారం జరిగింది. నాయుడుపేట పట్టణానికి చెందిన ఓ లారీ ధాన్యం లోడుతో చెన్నైకు బయలు దేరింది. స్థానిక నిప్పో పరిశ్రమ ఎదురుగా జాతీయ రహదారిపై వెళ్తుండగా డీజిల్ అయిపోవడంతో లారీ ఆగిపోయింది. అదేదారిలో చెన్నై వెళ్తున్న ఓ కంటైనర్ లారీ ఆగిఉన్న ధాన్యం లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ వీరమణి ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు రెండు గంటల పాటు తీవ్రంగా శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీసిశ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

సూళ్లూరుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0పై మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. పొదుపు సంఘాలు, మున్సిపాలిటీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ 2.0 కరపత్రాలు అందజేశారు. దుకాణాల యజమానులు కొత్తగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ ద్వారానే వస్తువులను విక్రయించాలన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ అధికారి భాస్కర్, మున్సిపల్ ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడీ టీచర్ శిరీష అన్నారు. మండల పరిధిలోని కడపత్ర అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో అంగన్వాడీ టీచర్లు భవాని, సుభాషిణి, నిర్మల పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

సూళ్లూరుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు నవజీవన్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. సంస్థ నిర్వాహకుడు బాలాజీ మాట్లాడుతూ హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, నివారణకు తగు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మండలంలోని మేనకూరు నుంచి భీమవరం గ్రామానికి నాబార్డ్ నిధులు రూ.88 లక్షలతో నిర్మించిన 4.7 కిలోమీటర్ల తారురోడ్డును శనివారం రాత్రి ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి జాడలేకపోవడంతో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక నిధులను మంజూరు చేసి పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం సర్పంచ్ అమృత సరళ, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, టీడీపీ నాయకులు నెలవల రాజేష్, విజయకుమార్ నాయుడు, నానాబాల సుబ్బారావు, నిత్యకృష్ణారెడ్డి, రవి, నారాయణ, కామిరెడ్డి అశోక్‌రెడ్డి, దార్ల రాజేంద్ర, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, చక్రపాణి, గాలి రాజేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సకల జన సంక్షేమమే సీఎం ధ్యేయం: నెలవల

పెళ్లకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధితో పాటు సకల జనుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శనివారం తాళ్వాయిపాడులో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రూ.15వేల ఆర్థిక సాయం అందించే విశిష్ట పథకానికి సీఎం శ్రీకారం చుట్టారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం పంచాయతీ పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన రవిచంద్ర (35) కుటుంబకలహాల నేపథ్యంలో గత నెల 26వ తేదీన పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు గమనించి చెన్నైలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కుక్కల బెడదను నివారించండి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కోట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన శనివారం జరిగింది. పలువురు అధికారులు తమ శాఖల్లో ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎంపీటీసీలు దారాసురేష్, షంషుద్దీన్, నారాయణ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ తెలిపారు. అదేవిధంగా పట్టణంలో ఆవులు ఎక్కడపడితే అక్కడ సంచరిస్తుండడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సభ్యులు చెప్పగా, ఆవుల యజమానులకు నోటీసులు ఇస్తామని ఎంపీడీవో అన్నారు. కాగా, సమావేశానికి 17 మంది ఎంపీటీసీలకు గాను 11 మంది, 21 మంది సర్పంచులుండగా ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. మండల సర్వసభ్య సమావేశాలకు ప్రతిశాఖ నుంచి అధికారులు హాజరుకావాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలకు కలెక్టర్‌కు సిఫారసు చేస్తామని తహసీల్దారు జయజయరావు అన్నారు. సమావేశంలో జడ్పీటీసీ కోటయ్య, పలుశాఖల ఇంజనీర్లు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత గోపాల్‌రెడ్డి మృతి



గోపాల్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తహసీల్దారు జయజయరావు, టీడీపీ నాయకులు

కోట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెలపూడి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కేతంరెడ్డి గోపాల్‌రెడ్డి (83) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటూ మృతి చెందారు. గోపాల్‌రెడ్డి మృతదేహానికి తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ గండవరం రజనమ్మ, తహసీల్దారు జయజయరావు, ఎస్ఐ పవన్‌కుమార్ నివాళులర్పించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మెహబూబి

గూడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీవో మెహబూబి అన్నారు. శనివారం స్థానిక అంకమ్మగుడి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహార ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజన, ఉమా, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

నాయుడుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నాగలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. ఉదయం గణపతి పూజ, గోపూజ, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం యాగశాల బలి, వాస్తుహోమం, రాత్రి నివేదన హారతి కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ గురుస్వామి బాలాజీ, చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, రాధయ్య, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శని త్రయోదశి



నందికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

నాగలాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయంలో శనివారం శని త్రయోదశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రధాన అర్చకులు ఆలయంలోని పరివార దేవతామూర్తులకు అభిషేకాలు చేసి దీప, ధూప, నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి పంచామృతాభిషేకం నిర్వహించారు. వివిధ పుష్పాలతో అలంకరణ చేపట్టారు. తదనంతరం నందీశ్వరుడికి మహాదీపారాధనలు, కుంభ, నక్షత్రహారతులు చేపట్టారు. ప్రదోష పూజానంతరం మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు దివ్యాంగ సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత పర్యవేక్షించారు.

వేలం ద్వారా ఆదాయం: పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న వివిధ షాపులకు సీల్డ్ టెండర్ ద్వారా బహిరంగ వేలం శనివారం జరిగింది. తిరుపతి గ్రూపు ఆలయాల ఈవో ఇ.మునిశేఖర్ పర్యవేక్షించారు. కారు పార్కింగ్, ఇత్తడి సామాన్ల దుకాణం, పాదరక్షలు భద్ర పరిచే దుకాణాల వేలం ద్వారా ఆలయానికి రూ.21,77,000 ఆదాయం వచ్చింది

వైభవంగా ప్రదోష నందిసేవ



శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం సాయంత్రం దీపారాధన అనంతరం స్వామిఅమ్మవార్లకు వైభవంగా ప్రదోష నందిసేవ నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు విశేష పూజలు చేసి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం నందిని ఆలయంలో ఊరేగించగా భక్తులు దర్శించుకున్నారు. అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరుడికి శనివారాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ, గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నేత్రపర్వంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



ఊంజలసేవలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

నారాయణవనం, అక్టోబర్ 4(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయంలో పెరటాసి నెల మూడో శనివారం భక్తులతో కిటకిటలాడింది. శనివారం ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరుడిని సుందరంగా అలంకరించి ఊయలలో అధిష్ఠింప జేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముక్కంటి సేవలో సుమన్



శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం సినీ నటుడు సుమన్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కైలాసనాథ ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవంలో పాలక మండలి

సత్యవేడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలం అరణ్యం కండ్రిగ పంచాయతీలో కొలువై ఉన్న కైలాసనాథ స్వామి ఆలయ పాలక మండలి ఛైర్మన్‌గా ఎస్.బాల చంద్ర నాయుడు నియమితులయ్యారు. ఆలయానికి పాలకమండలిని నియమిస్తూ ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్య లుగా టి.రాధ, ఎస్.మోహన్‌రాజు, ఏ.కే.లత, కె.వాసుదేవన్, బి.బాలసుబ్రమణ్యం, టి.శేఖర్, ఎస్.కళ, ఎస్.మంగమ్మ, టి.వి.రత్నసభాపతి, సి.శాంతి సభ్యులుగా, ఆలయ అర్చకుడు మహేంద్రశర్మను ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర ధార్మిక పరిషత్ కార్యదర్శి కె.రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం నూతన పాలక మండలి సభ్యుల సమక్షంలో ఎన్.బాలచంద్ర నాయుడు ఆలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.

చెరువులను తలపిస్తున్న గ్రామీణ రహదారులు



కేవీబీపురం ప్రధాన రహదారిపై నిలిచిన నీరు - దుస్థితిలో ఉన్న పెద్దపాలేడు రహదారి

కేవీబీపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. ఆరు నెలలుగా ఈ పరిస్థితి నెలకొని ఉన్నా ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడమే ఇందుకు కారణం. శుక్రవారం కురిసిన వర్షానికి ప్రధాన రహదారిపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నీరు వెళ్లే మార్గం పూడ్చి వేయడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. ఈ మార్గం మీదుగా ఆరోగ్య కేంద్రానికి చేరుకోవాల్సి ఉంది. అలాగే పలు విద్యా సంస్థలకు ఈ దారే ప్రధాన రహదారి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టకపోతే మండలవాసులు ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

కానరాని మరమ్మతులు...

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాలేడు రోడ్డు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పంట కాలువను తలపిస్తోంది. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారిని తారు రోడ్డుగా నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ కొంత మేర పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశాడు. దశాబ్దకాలంగా పనులు చేపట్టకపోవడంతో రాకపోకలకు దుర్భరంగా మారింది. వర్షం వస్తే రోడ్డులో ప్రయాణం ఇబ్బందికరంగా మారుతోంది. దీనిపై శుక్రవారం సీపీఎం నాయకులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు.

మోస్తరు వర్షం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం తెల్లవారు జాము నుంచి గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం దుక్కులు దున్నడానికి దోహద పడిందని, అలాగే ఆరుతడి పంటలకు మేలు జరిగిందని రైతులు తెలిపారు.

మార్గమధ్యంలో ఆగిపోయిన పల్లెవెలుగు బస్సు

రేణిగుంట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళ్తున్న పల్లెవెలుగు బస్సు మార్గమధ్యంలో మరమ్మతులకు గురై ఆగిపోయింది. రాజంపేట నుంచి తిరుపతికి వెళ్తున్న బస్సు రేణిగుంట మండలంలోని మూడో మైలు వద్ద బేరింగ్ ఊడిపోవడంతో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులను మరో బస్సులో తిరుపతికి చేర్చారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమమే కూటమి ధ్యేయం

- 1,883మందికి రూ.3కోట్ల లబ్ధి
- ఎమ్మెల్యే సుధీర్



ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే సుధీర్ - డ్రైవర్లతో ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆటో డ్రైవర్ సేవలో' భాగంగా శనివారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఊరందూరు నుంచి పానగల్ ఎస్ఎల్వీ కల్యాణ మండపం వరకు స్వయంగా ఆయన ఆటో నడుపుకుంటూ వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్త్రీ శక్తి పథకంతో ఆటో డ్రైవర్లు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రూ.15వేలు వారి ఖాతో పడుతుందన్నారు. నియోజకవర్గంలో 1,883మంది ఆటోడ్రైవర్లకు సుమారు రూ.3కోట్లు జమ కానున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఒక చేత్తో రూ.10 ఇచ్చి మరో చేత్తో రూ.100 లాగేసిందన్నారు. ఇక గత వైసీపీ హయాంలో గుంతలు పడిన రోడ్డుకు కనీసం తట్ట మట్టి పోసిన దాఖలాలు లేవన్నారు. దీంతో అనేక ప్రమాదాలు జరిగి ఎన్నో ప్రాణాలు పోయాయన్నారు. అంతే కాకుండా ఆటోల మరమ్మతులకు వేలకు వేలు ఖర్చు చేయలేక వాటిని అమ్ముకున్న దాఖలాలు ఉన్నాయన్నారు. గ్రీన్‌ట్యాక్స్ పేరుతో ఆటో డ్రైవర్లను ఇబ్బంది పెట్టిందన్నారు. ఇక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో ఆటోడ్రైవర్లు అనేక ఇబ్బందుల పాలయ్యారన్నారు. ఆటో డ్రైవర్లు రోడ్డు నియమ, నిబంధనలను పాటించి ఇళ్లకు క్షేమంగా చేరాలన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ కుమార్, నాయకులు చెంచయ్య నాయుడు, తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, కొట్టే సాయిప్రసాద్, గుర్రప్పశెట్టి, అక్కింతల కృష్ణయాదవ్, పురపాలకసంఘ కమిషనర్ భవానీ ప్రసాద్, పలువురు అధికారులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే ఆదిమూలం



పిచ్చాటూరులో ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆటో డ్రైవర్ సేవలో పథకం పేరిట ఆటో, క్యాబ్ డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం ఉదయం పిచ్చాటూరులోని ఎంకేటీ హాలులో పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆటో డ్రైవర్లకోసం కొత్త యాప్‌ని ఏర్పాటు చేసి వారికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. అనంతరం సత్యవేడు నియోజకవర్గానికి చెందిన 999 మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.1,49,85,000 చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అంతకు ముందు పిచ్చాటూరులోని శ్రీకాళహస్తి కూడలి నుంచి ఎంకేటీ కల్యాణ మండపం వరకు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే ఆటో నడిపారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి అన్నదానం చేశారు. ఎంపీపీ చంద్రశేఖర్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, ఎంపీడీవో మహ్మద్‌రఫి, ఎస్ఐ వెంకటేష్, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత దౌర్జన్యం

- విద్యుత్ స్తంభం ధ్వంసం
- రైతు ఫిర్యాదు



ధ్వంసమైన విద్యుత్ స్తంభం

శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత తమపై దౌర్జన్యానికి పాల్పడటమే కాకుండా విద్యుత్ స్తంభాన్ని ధ్వంసం చేశాడని రైతు వెంకటాద్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం ఈ ఘటన జరిగింది. తొట్టంబేడు మండలం బోనుపల్లికి చెందిన వెంకటాద్రికి గ్రామ శివార్లలో వ్యవసాయ భూమి ఉంది. అక్కడ సాగు కోసం 2021, ఏప్రిల్ 5న రూ.32,500 విద్యుత్‌శాఖకు చలానాగా చెల్లించాడు. సర్వే చేసిన అధికారులు అప్పట్లో స్తంభాలను నాటారు. తీగలు ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో వెంకటాద్రి ఇటీవల అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడంతో వారం రోజుల క్రితం తీగలు ఏర్పాటు చేసేందుకు శనివారం అధికారులు పొలం వద్దకు వచ్చారు. దీంతో తమ పొలంలో విద్యుత్ తీగలు లాగవద్దంటూ వైసీపీ నాయకుడు, అతని అనుచరులు అభ్యంతరం తెలిపారు. నాలుగున్నర సంవత్సరాల క్రితం స్తంభాలు నాటితే ఇప్పుడు ఎందుకు అభ్యంతరం తెలుపుతున్నారని అధికారులు నిలదీశారు. ఈ క్రమంలో తీగలు ఏర్పాటు విషయమై ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. వైసీపీ నాయకుడు విద్యుత్ స్తంభాన్ని ధ్వంసం చేయడంతో పాటు తన కుమారుడు బాలకృష్ణతో పాటు తనపై దాడికి పాల్పడినట్లు వెంకటాద్రి చెప్పారు. ఈ మేరకు తండ్రీకొడుకులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు. అలాగే వైసీపీ నాయకుడు చెంగయ్య కూడా తనపై దాడి జరిగిందని ఆస్పత్రిలో చేరాడు. ఈక్రమంలో వెంకటాద్రి తొట్టంబేడు ఎస్ఐ బలరాంకు ఫిర్యాదు చేశాడు.

రీ సర్వేకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ

సత్యవేడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేకు భూ యజమానులు సహకరించాలని డీటీ త్యాగరాజు కోరారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో రీ సర్వేపై పట్టణ ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో ఇప్పటికే పలు రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. రెండో దశలో భాగంగా త్వరలో సత్యవేడు పంచాయతీలో రెవెన్యూ, పంచాయతీ అధికారుల సమక్షంలో రీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. రీ సర్వే జరిగే ప్రాంతాల్లో ప్రజలు అందుబాటులో ఉండి సిబ్బందికి సహకరించాలని కోరారు. మండల సర్వేయర్ మోహన్‌కృష్ణ, వీఆర్వోలు త్రివేణి, వినోద్‌కుమార్, సుధ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం



శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం బెంగళూరుకు చెందిన ముక్తేశ్వర్, నాగరాణి రూ.1,00,116ను విరాళంగా అందజేశారు. చెక్కును ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామిఅమ్మవార్ల అంతరాయల దర్శనం కల్పించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 26వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శన టిక్కెట్ల ద్వారా 184 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,644, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 1.996 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,489మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,099, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 367మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 289 మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 83మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,601 విక్రయమయ్యాయి.

తీరిన లోవోల్టేజీ సమస్య



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాలేడు దళితవాడలో లోవోల్టేజీ సమస్య తీరింది. ఈనెల 1న బుధవారం దళితవాడ పర్యటనలో ఎమ్మెల్యే ఆదిమూలం దృష్టికి లోవోల్టేజీ సమస్యను స్థానికులు తీసుకొచ్చారు. ఆయన ట్రాన్స్‌కో అధికారులకు సమస్య పరిష్కరించాలని కోరారు. ఈక్రమంలో శనివారం ఉదయం ట్రాన్స్‌కో ఏఈ చలపతి ఆధ్వర్యంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్య తీర్చారు. సర్పంచ్ కాశీబాబు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు

సత్యవేడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. శ్మశాన వాటిక పిచ్చి మొక్కలతో చిట్టడవిలా మారింది. అంతిమ సంస్కారాలు, కర్మక్రియల నిర్వహణకు కష్ట సాధ్యంగా మారింది. సమస్యపై స్పందించిన వార్డు సభ్యుడు కోనయ్య పంచాయతీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో అధికారులు శ్మశాన వాటికలో ముళ్లపొదలు తొలగించారు.

తూతూమంత్రంగా గ్రామసభ

రేణిగుంట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లమండ్యం పంచాయతీ గ్రామ సభ పది నిమిషాల్లో ముగిసింది. మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన గ్రామసభ శనివారం మధ్యాహ్నం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. సర్పంచ్, ఇన్‌చార్జి కార్యదర్శి, కొంత మంది ప్రజాప్రతినిధులు హాజరైనా స్థానిక సమస్యలపై ఎటువంటి చర్చ లేకుండానే పది నిమిషాల్లో ముగించేశారు. గ్రామసభ నిర్వహణపై ప్రజలకు ఎటువంటి సమాచారం లేదు.

ఇత్తడి బిందెల దొంగ అరెస్టు

రేణిగుంట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఇత్తడి బిందెలను చోరీ చేసే వ్యక్తిని గాజులమండ్యం పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపాళేనికి చెందిన జయచంద్రారెడ్డి సమీప ఇళ్లల్లో ఇత్తడి బిందెలు చోరీ చేసి కుదవ పెట్టి ఆ డబ్బుతో మద్యం తాగేవాడు. ఈ నేపథ్యంలో అందిన ఫిర్యాదు మేరకు విచారించిన పోలీసులు జయచంద్రారెడ్డిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.